# సుందరి ఆవకాయ ప్రహసనం

(పరోపకారం పుణ్యం పరచింతనమే పాపం)

రాజ్యలక్ష్మి శశిధర్.K

మాధవరావు-సుందరి, సత్యం-సావిత్రి ఇరుగు పొరుగు నివసించే దంపతులు.

మాధవరావు గారు పేరుమోసిన వ్యాపారవేత్త. సుందరి కలవారి ఇంటి ఆడపడుచు సుకుమారంగా పెరిగింది. కాపురానికి వచ్చి 20 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా ఇంటిపని, వంటపని రాదని గొప్పగా చెబుతుంది. పుట్టింట కూడా చెయ్యలేదు కాబట్టి ఇక్కడ కూడా అలవాటవ్వలేదని చెబుతూ ఉంటుంది.

మాధవరావు గారు వినీ విన్నట్లు ఉంటారు. ఇంటిపని వంటపని చేయటానికి పనివారిని పెళ్లయిన కొత్తలోనే ఏర్పాటు చేసేసాడు.

వారికి ఇద్దరు సంతానం అబ్బాయ్ ఆనంద్ పై చదువులకు లండన్ వెళ్ళాడు. అమ్మాయి రమ్య 10 వ తరగతికి వచ్చింది. పిల్లలు ఇద్దరికీ సుందరి బద్ధకం మాత్రం రాలేదు. చిన్నప్పటి నుండి నాన్న బాటలోనే వారు నడిచారు.

సత్యం-సావిత్రి వీరి పొరుగున ఉంటారు. మాధవరావు గారి కర్మాగారంలోనే సత్యం నెలసరి జీతగాడు. సావిత్రి పొందకైన ఇల్లాలు. వీరికి ఒక కూతురు అరుణ. అరుణ కూడా రమ్య పాఠశాలలోనే 10వ తరగతి చదువుతోంది. అరుణకి పాక్షికంగా మాధవరావు గారే బడి ఫీజు సహాయం చేస్తూ ఉంటారు. రమ్య, అరుణ మంచి పిల్లలు కలిసి చదువుకుంటారు, ఆడుకుంటారు. పరీక్షలలో పోటీ పడుతూ ఉంటారు.



సావిత్రి ఇరుగు పొరుగు వారందరికీ తలలో నాలుక లాగా ఉంటుంది. వారింటిలో ఏవైనా పెళ్లిళ్లు, పేరంటాలు, శుభకార్యాలు జరిగితే వంటలకు సహాయం చేస్తూ వారిచ్చిన తృణమో పణమో తీసుకుంటూ ఉంటుంది. ఇంత అని ఏనాడూ అడిగి ఎరుగదు. అందరూ కూడా ఆమె కష్టం ఎప్పుడూ ఉంచుకోరు!.. ఒక్క సుందరి తప్ప!

సుందరి స్వతహాగా మంచిదే కానీ డబ్బు వల్ల వచ్చిన అహంకారం పాళ్లు మంచితనం కంటే కొంచం ఎక్కువ.

ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఊరికే ఇవ్వదు. పని చేయించుకొని వాళ్లకు ఇవ్వాలన్న మనసొప్పదు.

ప్రతీ సంవత్సరం ఆవకాయ పచ్చడి సుందరి అమ్మగారి ఇంటినుంచి తెచ్చుకుంటుంది.

ఈ సంవత్సరం నుండి ఇక్కడే పెట్టుకోవాలని సుందరి నిర్ణయించు కున్నది. కారణం సుందరి అమ్మా, నాన్న,అన్నా, వదిన పుష్కరాలకు ఊరు వెళ్లాల్సి రావటమే.

తనకు పెట్టటం రాదు. అలా అని నలుగురికీ తెలిస్తే పరువు తక్కువ. సుందరి ఆలోచించి చివరకు సావిత్రిని సహాయమడిగింది. ఊరికే చెయ్యొద్దు మీకు కూడా పచ్చడి మా దాంట్లోనే. సగం సగం తీసుకుందాం. పదార్థాలు అన్నీ నేనే

తెప్పిస్తాను నువ్వు ఆవకాయ కలిపితే చాలు అని చెప్పింది.

సావిత్రికి సుందరి మాటమీద నమ్మకం లేకపోయినా మాధవరావు గారి మీద గౌరవంతో ఒప్పుకున్నది.

ఆవకాయ పెట్టే రోజు రానే వచ్చింది! సుందరి తనకు బయట కొన్న ఆవపిండి కారం ఇష్టముండవని, పుట్టింట్లో అన్నీ దగ్గర ఉండి తానే పిండ్లు కొట్టించేదని చెప్పింది.



సావిత్రి సరేనని ఆవాలు, మిరపకాయలు, శనగలు, ఉప్పు ఎండలో పెట్టి బాగు చేసి కారం దంచి ఆవకాయకు సిద్ధం చేసింది. కాయలు తోట నుంచి మాధవరావు గారు తెప్పించారు. కాయలన్నీ శుభ్రంగా కడిగి ఆరబెట్టి తొడిమలు తీసి చక్కగా ఒకటే మాదిరిగా ముక్కలు తరిగింది సావిత్రి.

సుందరి మాత్రం చూస్తూ ఊరుకుంది కానీ ఏ సహాయమూ చేయలేదు.

సావిత్రి ఒక్కతే మడి కట్టుకొని ముక్కలకు సరిపడా పప్పు నూనె, ఆవపిండి,దంచిన ఉప్పు, కారం, పసుపు, మెంతులూ అన్నీ సమపాళ్లలో కలిపి 4 జాడీల్లోకి నింపి వాటికి వాసన కట్టింది. జాడీకి పసుపు కుంకుమ పెట్టీ హారతి ఇచ్చి దిష్టి కూడా తీసింది.

మూడో రోజు ఆవకాయ తిరగ గలిపి కొంచెం గిన్నెలోకి తీసి సుందరికి ఇచ్చింది దేవుడి దగ్గర పెట్టమని.

సుందరి దేవుడి దగ్గర పెట్టి మమ అనిపించింది. భోజనాల్లో ఆవకాయ వడ్డించింది సుందరి. రుచి అమోఘంగా అనిపించింది మాధవరావు గారికి.

వెంటనే సావిత్రిని పిలిచి 100 రూపాయలు కానుక ఇచ్చారు. తన చిన్నతనంలో అమ్మ చేతి రుచి ఆస్వాదించినట్టుగా ఉన్నదని కళ్ళనీళ్ళ పర్యంతం అయ్యారు. తనకు ఒక ఆలోచన వచ్చిందని మనమే వేసవిలో ఆవకాయ రుచిగా శుచిగా చేసి కావలసిన వారికి అందిస్తే చాలా బాగుంటుందని చెప్పాడు. సావిత్రికి అంగీ కారమైతే పెట్టుబడి తను పెడతానని లాభం చెరి సగం తీసుకుందామని,

చేసినందుకు సావిత్రికి నెలసరి జీతం కూడా ఇస్తానన్నాడు. ఆలోచించి అంగీకారం తెలుపమని చెప్పాడు. ఎంతైనా వ్యాపారవేత్త కాబట్టి దూరాలోచన చేశాడు. సావిత్రి కి కూడా కుటుంబ నిర్వహణకు ఉపయోగపడుతుందని సంతోషంగా ఒప్పుకుంది.

అసలు కథ ఇప్పుడే మొదలయ్యింది.

భర్త సావిత్రిని మెచ్చుకోవటం సుందరికి నచ్చలేదు. తాను అన్న దగ్గరుండి చేసుకున్నానని పొడులు కొనకుండా దంపించి చేయించటం సరి అయిన కొలతలు తను చెప్పటం వల్లే ఆవకాయ

రుచి వచ్చింది అంతే కానీ సావిత్రి గొప్ప ఏమీ లేదని తెగేసి చెప్పింది.

పచ్చడి తానే పెడతానని సావిత్రికి లాభం ఇస్తే ఊరుకోనని చెప్పింది. అప్పటికి మాధవరావు విని ఊరుకున్నారు.

సుందరి మాత్రం వదల్లేదు.



సావిత్రికి ఇస్తానన్న పచ్చడి కూడా పంపలేదు. సావిత్రికి రుచి చూడటానికి గిన్నెలో తీసిన పచ్చడి మాత్రం పంపింది. పైగా మాధవరావు గారు నూరు రూపాయలు ఇచ్చారని అవి సావిత్రి చేసిన పనికి చాలా ఎక్కువ అని చెప్పి తప్పించు కున్నది.

సావిత్రికి మనసు బాధ కలిగింది కానీ బయటకు ఏమి అనలేకపోయింది.తనకు అంతే ప్రాప్తమని సరిపెట్టుకున్నది.

మాధవరావు గారు వారిస్తున్నా వినకుండా తను పచ్చళ్ళ వ్యాపారం చేస్తానని మొండితనం చేసి భర్తకి చెప్పి 200 కాయలు తెప్పించింది సుందరి. తనే దగ్గరుండి పనివాళ్ళతో తరిగించింది.

వారు కాయలు 5 రూపాయలు ఇస్తేనే తరుగుతామని ముందే ఒప్పందం కుదుర్చుకొని తరిగి పెట్టి వెళ్ళిపోయారు

కారం ఆవపిండి దంచటానికి బయట నుండి పనివాళ్లని తెప్పించి కొట్టించింది వారు రోజు కూలి ఇద్దరికీ కలిపి 2000 అడిగారు. సుందరి సరే అని ఆ ముడుపులు సమర్పించు కున్నది.

ఇక ఆవకాయ మొత్తానికి కలిపి పెద్ద పెద్ద జాడీల్లోకి చేర్చింది. పని అలవాటు లేక ఒళ్ళు పులిసిపోయింది. కారం ఒళ్ళంతా పూసుకున్నది. సాయంత్రం అయ్యేసరికి ఉండలేక మాధవరావు గారికి ఫోన్ చేసింది తన ప్రాణం పోతోందని.

మాధవరావు గారు ఇంటికి వచ్చి సుందరి పరిస్థితి చూసి ఆసుపత్రికి తరలించారు. I.C.U లో సుందరికి ఐస్ తోటి కాపడం పెడుతున్నారు డాక్టర్స్. ఎక్కువ మొత్తంలో కారం సరిఅయిన జాగ్రత్తలు తీసుకోకుండా చేతులు పెట్టటం,అది అంతా ఒంటికి పట్టటం వల్ల స్కిన్ రియాక్షన్ వచ్చిందని 2 రోజుల వరకు అబ్జర్వేషన్ తప్పదని చెప్పారు. 3రోజుల తరువాత మందులు తీసుకొని ఇంటికి డిశ్చార్జ్ అయ్యి వచ్చిన సుందరి సగమయిపోయింది మనిషి.

మాధవరావు గారికి హాస్పిటల్ బిల్లు లక్ష దాటింది.

మూడో రోజు ఆవకాయ తిరగ కలపటానికి సావిత్రిని పిలిపించింది సుందరి. మాధవరావు గారి మీద మర్యాదతో సావిత్రి వచ్చి మూత తీసి చూడగా తట్టులా బూజు పేరుకొని జాడీలు దర్శనమిచ్చాయి. సరియైన కొలతలు వేయకపోవడంతో పచ్చడి పాడయ్యింది.

చేసేది లేక మాధవరావు గారు జాడీలతో సహా దూరంగా పారేయించారు. అత్యాశ తో సుందరి తాను చేసిన పనికి సిగ్గు పడింది. సావిత్రికి కూడా క్షమాపణలు చెప్పింది.తాను మోసం చేసినందుకు క్షమించమని కోరింది. ఇంకెప్పుడూ అలా ప్రవర్తించనని భర్తకు చెప్పింది.

సుందరి పెట్టిన ఆవకాయ విలువ “అక్షరాల లక్ష రూపాయల పై మాటే” . చాలా ఖరీదైనది అని అందరూ నవ్వేశారు.

మాధవరావు గారు సావిత్రి సహాయంతో మరుసటి సంవత్సరం ఆవకాయ వ్యాపారం ప్రారంభించాడు. కొడుకు చదువుకుంటున్న లండన్‌లో స్నేహితులకు కూడా నచ్చి మంచి ఆర్డర్స్ రావటం మొదలయ్యాయి. ఇదంతా సావిత్రి మంచితనం అని మాధవరావు చెప్పాడు పత్రికల వాళ్లకు.

నీతి: పరోపకార పుణ్యం. మనం మంచి చేస్తే మనకు మంచే జరుగుతుంది.

***



